జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
మంగళవారం | 13 | అక్టోబర్ | 2026 పేజీలు 12



9

సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కోవాలి

## అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును
# వేగవంతం చేయాలి



### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్: బ్యూరో, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి ) ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును వేగవంతం చేయడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని, భూముల రీసర్వే ప్రక్రియను సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

2





### గాయత్రీదేవిగా
# అమ్మవారి దర్శనం

సరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో ఈరోజు గాయత్రీదేవి (బ్రహ్మచారిణి) రూపంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు చంద్రఘటంతో, గాజులతో అలంకరణతో అమ్మవారిని అలంకరించారు. వేలాది మంది భక్తులు ఈరోజు అమ్మవారిని దర్శించుకున్నారు.దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది.

3



## బతుకమ్మ సంస్కృతికి ప్రతీక

- తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనం
- పూలనే పూజించే అరుదైన పండుగ
- మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

2



### గోదావరి పుష్కరాల పనుల్లో
# జాప్యానికి తావివ్వొద్దు

ఘాట్లు, రహదారులు, మౌలిక వసతులు సిద్ధం చేయాలి

దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ఆదేశాలు

2

పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 12 ప్రజాజ్యోతి: గోదావరి పుష్కరాలు– 2027కు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు.



### అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును

# వేగవంతం చేయాలి

**కరీంనగర్: బ్యూరో, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి )** ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును వేగవంతం చేయడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని, భూముల రీసర్వే ప్రక్రియను సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.మంగళవారం రాత్రి నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం**

మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. రెండో విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను కూడా త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని పేర్కొన్నారు.

**భూముల రీసర్వేపై ప్రత్యేక దృష్టి**

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు గ్రామస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. రీసర్వే ఉద్దేశం, ప్రక్రియపై రైతులకు ముందుగానే సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని ఆదేశించారు. నిర్ణీత ప్రక్రియ ప్రకారం రీసర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని స్పష్టం చేశారు.భూ భారతి పథకంలో భాగంగా సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వాటి ప్రయోజనాలు అర్హులైన వారందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, ఆర్డీవో జలకుమారి, ఎంపీడీవోలు, తహసీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ మన సంస్కృతికి ప్రతీక

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి ):**

బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే మైదానంలో గౌతమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బతుకమ్మను ఎత్తుకొని మహిళలతో కలిసి ఆటపాటల్లో పాల్గొన్నారు. ఆడపడుచులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. బతుకమ్మ పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని పేర్కొన్నారు. పూలనే బతుకమ్మగా పేర్చి అమ్మవారిగా భావించి పూజించడం తెలంగాణ సంస్కృతిలోని ప్రత్యేకత అన్నారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ఆడపడుచుల కుటుంబాలు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించే గొప్ప పండుగ బతుకమ్మ అని వివరించారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ బతుకమ్మ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ వేడుకలకు అధికారిక గుర్తింపు లభించిందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఆడపడుచులంతా ఐక్యంగా, ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.గౌతమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో.. గౌతమి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గౌతమిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నర్సాసు లక్ష్మణరావు, కరీంనగర్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణారావు, నగర అధ్యక్షులు చల్ల హరి శంకర్, మాజీ గ్రంథాల సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ చల్లా స్వరూప రాణి, కార్పొరేటర్లు గుగ్గిల్ల జయశ్రీ, నలువాల పుష్పలత రవీందర్, యూసుఫ్ అలీ, మాజీ కార్పొరేటర్లు గందె మాధవి మహేష్ ఎడ్ల సరిత, మహిళా నాయకురాళ్లు, పలువురు భారస నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి పుష్కరాల పనుల్లో జాప్యానికి తావివ్వొద్దు

**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 12 ప్రజా జ్యోతి:**

గోదావరి పుష్కరాలు–2027కు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, భూసేకరణ, ప్రభుత్వ అనుమతులు, టెండర్ల ప్రక్రియలో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

- సోమవారం దేవాదాయ కమిషనర్ హనుమంతరావుతో కలిసి సంబంధిత జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈ సమావేశంలో పాల్గొన్నారు. పుష్కరాల కోసం చేపట్టిన భూసేకరణ, ఘాట్ల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, అదనపు పనుల ప్రతిపాదనలు, టెండర్ల పురోగతిపై సమీక్షించారు.
- పుష్కరాలు ప్రారంభమయ్యే సమయానికి ఎలాంటి పనులు పెండింగ్‌లో ఉండకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని శైలజ రామయ్యర్ సూచించారు. ప్రతి పనికి స్పష్టమైన లక్ష్యాలు, గడువులు నిర్దేశించుకుని నిరంతరం పురోగతిని పర్యవేక్షించాలని తెలిపారు. ప్రారంభమైన పనులను వేగవంతం చేయడంతోపాటు పరిపాలనా అనుమతులు, భూసేకరణ, టెండర్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నిర్మాణాల నాణ్యతలో రాజీ పడకుండా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేయాలని సూచించారు.
- కొత్త పుష్కర ఘాట్ల నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలించేటప్పుడు భక్తుల రద్దీ, ప్రస్తుతం ఉన్న ఘాట్ల సామర్థ్యం, నదిలో నీటి ప్రవాహం, భద్రత, రహదారి సౌకర్యాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణంతోపాటు ఇప్పటికే ఉన్న ఘాట్ల విస్తరణ, మరమ్మతులు, అప్రోచ్ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలు, ప్రభుత్వ అనుమతులను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.
- టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని, ఎల్–1 ఖరారు, అంగీకార పత్రాల జారీ, ఒప్పందాల ప్రక్రియలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిశీలనలో ఉన్న నమూనాలు, సవరించిన అంచనాలు, ఇతర అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.
- పుష్కరాల సమయంలో భారీగా తరలివచ్చే భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత వంటి సౌకర్యాలను ముందస్తుగా కల్పించాలని శైలజ రామయ్యర్ స్పష్టం చేశారు.
- దేవాదాయ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ, ప్రతి పుష్కర ఘాట్‌ను భక్తులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఘాట్ల విస్తీర్ణం ఉండాలని, తొక్కిసలాటకు అవకాశం లేకుండా రాకపోకలను నియంత్రించాలని తెలిపారు. దివ్యాంగులు సులభంగా చేరుకునేందుకు ర్యాంపులు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి ఘాట్‌లో అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. రహదారి విస్తరణ పనులకు సంబంధించిన టెండర్లను త్వరగా పూర్తి చేసి, పనులను నిర్ణీత గడువులోగా చేపట్టాలని పేర్కొన్నారు.

**పెద్దపల్లి జిల్లాలో పుష్కర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి**

- గోదావరి పుష్కరాలు–2027 నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాలో గోదావరి తీర ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. పుష్కర ఘాట్లు, అప్రోచ్ రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, భద్రత, భక్తుల రాకపోకల నిర్వహణపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
- క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి అవసరమైన పనులను గుర్తిస్తామని, భూసేకరణ, అనుమతులు, టెండర్ల ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.
- ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 12(ప్రజాజ్యోతి )**

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో ఈరోజు గాయత్రీదేవి (బ్రహ్మచారిణి) రూపంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు చంద్రఘటంతో, గాజులతో అలంకరణతో అమ్మవారిని అలంకరించారు. వేలాది మంది భక్తులు ఈరోజు అమ్మవారిని దర్శించుకున్నారు.దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. వేదమాతగా, జ్ఞానప్రదాయినిగా, సకల చైతన్యానికి మూలశక్తిగా గాయత్రీదేవిని భక్తులు ఆరాధిస్తారు. అమ్మవారి ఈ రూపం జ్ఞానం, వివేకం, పవిత్రత, ఆధ్యాత్మిక తేజస్సుకు ప్రతీకగా నిలుస్తుంది. దసరా నవరాత్రుల్లో గాయత్రీదేవి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందించడంతోపాటు జ్ఞానానికి, ధర్మానికి ప్రాధాన్యమివ్వాలనే సందేశాన్ని గుర్తుచేస్తుంది.గాయత్రీదేవి ఆరాధన ద్వారా విద్య, వివేకం, ఏకాగ్రత, సత్ప్రవర్తన కలగాలని భక్తులు ప్రార్థిస్తారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పెంపొందించుకోవడం, మంచి ఆలోచనలతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవడం ఈ ఆరాధనలోని ప్రధాన సందేశంగా భావిస్తారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారి ఆలయంలో లింగార్చన కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. పిండితో లింగాకారం ప్రతిష్టించి అభిషేకం చేశారు. దీపాలు వెలిగించారు. బీజేపీఎం రాష్ట్ర అధ్యక్షులు గణేశ్ సహా పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. మరోవైపు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సైతం దాండియా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. వేలాది మంది భక్తులు ఆధ్యాత్మిక భావనతో ఆడుతూ పాడుతూ దాండియాలో పాల్గొన్నున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి పొద్దుపోయే వరకు ఆలయంలో అమ్మవారి సేవలోనే గడుపుతున్నారు. ఆద్యంతం దాండియా కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో అగ్నిప్రమాదం ?

**ఎండపల్లి, అక్టోబర్ 12, ప్రజా జ్యోతి:** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో గ్రామ ఉప సర్పంచ్ దాసరి కళ్యాణి కొమరయ్య కు చెందిన ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా అడ్డుకోగలిగారు.ఈ ఘటనలో బంగారు ఆభరణాలు, విలువైన డాక్యుమెంట్లు సహా పలు వస్తువులు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. అగ్నిప్రమాదం కారణంగా సుమారు రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉండవచ్చని బాధితుల అంచనా? ఆస్తి విలువపై అంచనా అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది కాగా ప్రమాదంలో నష్టపోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



### కోరుట్ల రవాణా శాఖలో ఏజెంట్ల దందాకు

# అడ్డుకట్ట పడిందా?

**ఏసీబీ దాడుల తర్వాత మారని పరిస్థితులపై ప్రజల్లో చర్చ**
**ఒక్కో ఏజెంట్‌కు ఒక్కో కోడ్ అంటూ ఆరోపణలు!**



**కోరుట్ల, అక్టోబర్ 12 ప్రజాజ్యోతి:**

కోరుట్ల రవాణా శాఖ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించిన అనంతరం అక్కడి పరిస్థితుల్లో మార్పు వచ్చిందా? ఏజెంట్ల ద్వారా జరిగే పనులకు అడ్డుకట్ట పడిందా? లేక పాత పద్ధతులే కొనసాగుతున్నాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.రవాణా శాఖ కార్యాలయంలో వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు తదితర సేవల కోసం వచ్చే ప్రజలకు పారదర్శకంగా సేవలు అందుతున్నాయా లేదా అన్నది అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. కార్యాలయంలో ఏజెంట్ల పాత్ర ఎంతవరకు ఉంది? ప్రభుత్వ నిర్ణయించిన రుసుములకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**ఒక్కో ఏజెంట్‌కు ఒక్కో కోడ్.. ఏమిటి వ్యవహారం?**

కార్యాలయంలో ఏజెంట్లకు ప్రత్యేక కోడ్లు కేటాయించి పనులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కోడ్ల వెనుక ఉన్న వ్యవహారం ఏమిటి? వాటిని ఎవరు కేటాయించారు? వాటి ఆధారంగా ఎలాంటి సేవలు అందిస్తున్నారు? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన అధికారిక ఆధారాలు, సంబంధిత అధికారుల వివరణ వెలుగులోకి రావాల్సి ఉంది.

**నెలకు లక్షల రూపాయల మామూళ్లు?**

రవాణా శాఖ కార్యాలయంలో నెలవారీగా లక్షల రూపాయల మేర మామూళ్లు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు కూడా చర్చకు వస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే వాటి వెనుక ఎవరున్నారు? డబ్బులు ఎవరి నుంచి ఎవరికి చేరుతున్నాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది. ఆరోపణల తీవ్రత దృష్ట్యా సంబంధిత రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, మధ్యవర్తుల పాత్రపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**ఏసీబీ దాడుల ఉద్దేశం నెరవేరిందా?**

అవినీతిని అరికట్టడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంచడం, సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించడం ఏసీబీ చర్యల ప్రధాన లక్ష్యాలు. అయితే దాడుల అనంతరం కూడా అక్రమ వసూళ్లపై ఆరోపణలు వినిపిస్తుంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితులను మరోసారి సమీక్షించాల్సిన అవసరం ఏర్పడుతుంది. కార్యాలయంలో జరుగుతున్న కార్యకలాపాలపై ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఏజెంట్ల పాత్రను పరిశీలించడంతో పాటు, ప్రభుత్వ రుసుముల వివరాలను ప్రజలకు స్పష్టంగా అందుబాటులో ఉంచాలి. అదనపు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వాటిని విచారించి, ఆధారాలు లభించిన పక్షంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

**ప్రజలకు పారదర్శక సేవలు అందించాలి**

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు తమ పనుల కోసం అనవసరంగా మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండకూడదు. నిర్ణీత రుసుములతోనే సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి. ఏసీబీ దాడుల అనంతరం కోరుట్ల రవాణా శాఖలో ఎలాంటి మార్పులు వచ్చాయి? ఏజెంట్ల వ్యవస్థపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? నెలవారీ మామూళ్ల ఆరోపణల్లో వాస్తవాలేమిటి? అనే అంశాలపై సంబంధిత శాఖ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.ప్రజల ప్రశ్న ఒక్కటే.. ఏసీబీ దాడులతో అక్రమాలకు నిజంగా అడ్డుకట్ట పడిందా? లేక దాడుల తర్వాత కూడా ఆరోపణలు కొనసాగుతున్నాయా? ఈ ప్రశ్నలకు అధికారిక విచారణ, ఆధారాలు, సంబంధిత అధికారుల స్పందన ద్వారానే స్పష్టత రానుంది.

## భార్య సర్పంచ్ భర్త పెత్తనం





**గొల్లపెల్లి అక్టోబర్ 12 ప్రజాజ్యోతి** గొల్లపెల్లి మండలం మల్లన్నపేటలో సర్పంచ్ భర్త అధికార దుర్వినియోగంపై ఆరోపణలు సర్పంచ్ లేకుండానే హైమాస్ట్ లైట్ల ప్రారంభం ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు అవమానం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేస్తామన్న ఉప సర్పంచ్ ముత్యాల స్వామి గ్రామంలో సర్పంచ్ పదవి భార్యదైతే పెత్తనం మాత్రం భర్తదా? అన్న విమర్శలు గొల్లపల్లి మండలం మల్లన్నపేటలో వెల్లువెత్తుతున్నాయి సర్పంచ్ సిద్దెంకి లక్ష్మి భర్త, ఐదో వార్డు సభ్యుడు సిద్దెంకి మల్లారెడ్డి సర్పంచ్‌కు బదులుగా తానే అధికారాలు చలాయిస్తున్నారంటూ గ్రామ ఉప సర్పంచ్ ముత్యాల స్వామి ఆరోపించారు భార్య పదవిని అడ్డం పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు గ్రామ సర్పంచ్ లక్ష్మి అందుబాటులో లేని సమయంలోనూ ఆమె భర్త మల్లారెడ్డి సర్పంచ్ హోదాలో వ్యవహరిస్తూ వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారని ఉప సర్పంచ్ ఆరోపించారు గ్రామంలో ఉప సర్పంచ్‌తో పాటు తోటి వార్డు సభ్యులకు కనీస ప్రోటోకాల్ మర్యాదలు సైతం పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు

**హైమాస్ట్ లైట్ల ప్రారంభంపై వివాదం**

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవం వివాదానికి దారితీసింది సర్పంచ్ లక్ష్మి లేకుండానే ఆమె భర్త మల్లారెడ్డి వాటిని ప్రారంభించడంపై ఉప సర్పంచ్ అభ్యంతరం వ్యక్తం చేశారు ప్రజాప్రతినిధుల హోదాలు బాధ్యతలను పక్కనపెట్టి తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు ఎన్నికైన ప్రజాప్రతినిధుల హక్కులు గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి భార్య పదవిని అడ్డం పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు.అయితే ఇలా చేయడం మొదటిసారి కాదని గతంలోనూ పలు సందర్భాల్లో ఇలాంటి ఘటనలే జరిగాయని తెలిపారు ఈ వ్యవహారంపై త్వరలోనే జిల్లా పంచాయతీ అధికారిని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఉప సర్పంచ్ ముత్యాల స్వామి తెలిపారు గ్రామ పంచాయతీ పాలనలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదని పేర్కొన్నారు. మల్లన్నపేటలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి

# విధి నిర్వహణలో సత్తా చాటిన కోరుట్ల ఎస్సై శ్యామ్ రాజ్!

- **గణేష్ నవరాత్రి ఉత్సవాల ప్రశాంత నిర్వహణ..**
- **లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి విశేష కృషి**
- **ఎస్సై శ్యామ్ రాజ్‌కు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రశంసలు..**
- **ప్రశంసా పత్రం అందజేత**



**కోరుట్ల, అక్టోబర్ 12 ప్రజాజ్యోతి :** విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకొస్తున్న కోరుట్ల ఎస్సై శ్యామ్ రాజ్‌ను జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు, గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో కీలక పాత్ర పోషించడం, రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయడం వంటి అంశాలను గుర్తించి ఆయనకు ప్రశంసా పత్రం అందజేశారు.– ఉత్సవాల ప్రశాంత నిర్వహణలో కీలక పాత్రగణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ప్రజలు ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకునేలా కోరుట్ల ఎస్సై శ్యామ్ రాజ్ విధి నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. పోలీస్ శాఖ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేందుకు కృషి చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీస్ బందోబస్తు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చారు.– లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చొరవపోలీస్ విధుల్లో భాగంగా రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు కూడా ఎస్సై శ్యామ్ రాజ్ కృషి చేశారు. కేసుల పరిష్కారానికి చొరవ చూపడం ద్వారా సంబంధిత వ్యక్తులకు న్యాయపరమైన పరిష్కారం లభించేలా ప్రయత్నించారు. విధి నిర్వహణతో పాటు కేసుల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వడాన్ని జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించారు.– ప్రతిభకు గుర్తింపుగా ప్రశంసా పత్రంవిధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కోరుట్ల ఎస్సై శ్యామ్ రాజ్‌తో పాటు పోలీస్ సిబ్బంది మమతను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేసే అధికారులు, సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించేందుకు ప్రేరణ కలుగుతుందని ఈ గుర్తింపు తెలియజేస్తోంది.

# కోరుట్ల ప్రధాన కూడళ్లలో చీకట్లు.. ప్రమాదాలకు ఆహ్వానం!

- **నంది, కార్గిల్ చౌరస్తాల్లో హైమాస్ లైట్లు వెలిగించాలి**
- **బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు దమ్మ సంతోష్ రెడ్డి డిమాండ్**





**కోరుట్ల, అక్టోబర్ 12 ప్రజాజ్యోతి** కోరుట్ల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో హైమాస్ విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో చీకట్లు అలుముకుంటున్నాయని, దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కోరుట్ల పట్టణ బీజేవైఎం అధ్యక్షుడు దమ్మ సంతోష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నంది చౌరస్తా, కార్గిల్ చౌరస్తా వద్ద హైమాస్ లైట్లు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

**ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది?**

పట్టణంలోని ప్రధాన కూడళ్లు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటాయని, అలాంటి ప్రాంతాల్లో రాత్రి వేళల్లో తగినంత వెలుతురు లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని దమ్మ సంతోష్ రెడ్డి పేర్కొన్నారు. చీకట్లో వాహనదారులు రహదారులను సరిగా గుర్తించలేకపోవడం, పాదచారులు రోడ్డు దాటే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత నిస్తూ సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రజాధనం ఖర్చు చేస్తున్నా ప్రయోజనం ఏది?**

హైమాస్ లైట్ల ఏర్పాటు, మరమ్మతుల కోసం ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పటికీ అవి నిరంతరం పనిచేయకపోవడంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. మరమ్మతులు చేసిన తర్వాత కూడా దీపాలు ఎందుకు పనిచేయడం లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. తాత్కాలికంగా మరమ్మతులు చేసి వదిలేయకుండా, విద్యుత్ సరఫరా, సాంకేతిక లోపాలు తదితర అంశాలను పరిశీలించి హైమాస్ లైట్లు నిరంతరం వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**అధికారులు వెంటనే స్పందించాలి**

నంది చౌరస్తా, కార్గిల్ చౌరస్తా వంటి ప్రధాన కూడళ్లలో వెలుతురు సదుపాయాలను మెరుగుపరచడం మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారుల బాధ్యత అని దమ్మ సంతోష్ రెడ్డి పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా రహదారులపై తగిన వెలుతురు ఉండేలా చూడాలన్నారు. హైమాస్ లైట్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం ఉండకూడదని, సమస్యలు అధికారుల దృష్టికి వచ్చినప్పుడు వాటిని వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. నంది చౌరస్తా, కార్గిల్ చౌరస్తా వద్ద హైమాస్ లైట్లను పూర్తిస్థాయిలో పనిచేయించేలా మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి, ప్రజలకు మెరుగైన వెలుతురు, సురక్షితమైన ప్రయాణ వాతావరణాన్ని కల్పించాలని దమ్మ సంతోష్ రెడ్డి డిమాండ్ చేశారు.

## జర్నలిస్టుకు మెట్ పల్లి ప్రెస్ క్లబ్ ఆర్థిక భరోసా



**మెట్‌పల్లి, అక్టోబర్ 12,ప్రజా జ్యోతి:** తోటి జర్నలిస్టు అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులు మానవత్వంతో స్పందించారు. తమ సహచరుడికి అండగా నిలుస్తూ రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు జంగం విజయ్ అనారోగ్యంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం ఆసుపత్రికి వెళ్లి విజయ్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తోటి జర్నలిస్టు కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలవడం ద్వారా ప్రెస్ క్లబ్ సభ్యులు జర్నలిస్టుల మధ్య ఉన్న ఐక్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భూరం సంజీవ్, జనరల్ సెక్రటరీ మహమ్మద్ అజీమ్, గౌరవ సలహాదారు దాసం కిషన్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ అఫ్రోజ్, మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ పాల్గొన్నారు.

## బుగ్గారంలో కేసీఆర్‌కు పాలాభిషేకం



బుగ్గారం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి): నూతన జిల్లాలు, మండలాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సోమవారం బుగ్గారం మండల కేంద్రంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. బుగ్గారం మండల ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలోని పది జిల్లాలను 33 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించి, పాలనను ప్రజలకు చేరువ చేసిందన్నారు. కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటుతో విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యాయని పేర్కొన్నారు. బుగ్గారం మండల ఏర్పాటుతో స్థానిక ప్రజలకు పరిపాలనా సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ విషయంలో కృషి చేసిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో మాసర్తి రాజిరెడ్డి, అబ్దుల్ రహమాన్, తుదిచెర్ల శంకర్, పొన్నం శంకర్, పొన్నం సత్తన్న, పొల్లంపెల్లి మల్లేశం, పదం సత్తన్న, గంగాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, మాసర్తి అశోక్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ వైఫల్యాలపై ప్రచారం



**గోదావరిఖని, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి) :** రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు అధికార పార్టీ నాయకులు,కార్యకర్తలు బి ఆర్ ఎస్ వైఫల్ వైఫల్యాలను ఎండగట్టారు. దీనిలో భాగంగా మంగళ వారం ఆర్జీవన్ జీడికె 11ఏ, ఓసీపీ-5,ఏరియా వర్క్ షాప్,సింగరేణి ఏరియా హాస్పిటల్ తో పాటు ఇతర బొగ్గు గనుల వద్ద ఎమ్మెల్యే బృందం కరపత్రాలను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కార్మికులకు జరిగిన అన్యాయం,కార్మికుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను కార్మికులకు వివరించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి సంస్థకు సంబంధించిన నిధుల వినియోగం,కార్మికుల ఆదాయపు పన్ను మినహాయింపు,సొంత ఇంటి పథకం,లాభాల వాటా చెల్లింపులు,మెడికల్ బోర్డు ద్వారా వారసత్వ ఉద్యోగాల కల్పన వంటి అంశాల్లో కార్మికులకు ఎదురైన సమస్యలను కరపత్రాల్లో ప్రస్తావించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం చేపడుతున్న చర్యలను,కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న అంశాలను వివరించారు.కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు,ఆదాయపు పన్ను మినహాయింపు,లాభాల వాటా చెల్లింపులు,వారసత్వ ఉద్యోగాల వంటి కీలక అంశాల పరిష్కారానికి కృషి చేస్తున్న విషయాలను తెలిపారు.సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, సంస్థ అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నాయకత్వంలో నిరంతరం కృషి చేస్తామని బృందం సభ్యులు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే టీం సభ్యులు జనగాం శ్రీనివాస్ గౌడ్,అరగంట కృష్ణ, భాస్కర్ కిరణ్,పాకాల సాయికుమార్, బద్రి శంకర్,ఎల్.ఆంజనేయులు,గోషికే కనకయ్య, మండల రమేష్, దార సుశీల,రవికుమార్,కుమారస్వామి సంపత్,మామిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**చిగురుమామిడి/అక్టోబర్ 12, (ప్రజా జ్యోతి) :** చిగురుమామిడి మండలంలోని చిన్న ముల్కనూర్ గ్రామానికి చెందిన కత్తెరమల్ల రమేష్ (28) అనే యువకుడు సోమవారం హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో సద్దుల బతుకమ్మ, విజయదశమి పండుగల సందర్భంగా సర్పంచ్ గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు విద్యుత్ బల్బులు అమర్చేందుకు రమేష్ ను పనికి పిలిపించారు. ప్రతీసారి గ్రామ పంచాయతీ విద్యుత్ పనులకు వచ్చే రమేష్ యథావిధిగా వచ్చి విద్యుత్ స్తంభం ఎక్కి బల్బులు బిగిస్తుండగా, పైన ఉన్న విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగిలి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన రమేష్ ను వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమంగా ఉండటంతో,హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారం రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు వారు తెలిపారు.

# బతుకమ్మపాటలతోభీమేశ్వర సదన్‌లో కోలాహలం

### మూడోరోజు ముద్దపప్పు నైవేద్యం



**వేములవాడ, అక్టోబర్, 12 : ప్రజాజ్యోతి.** వేములవాడలోని భీమేశ్వర సదన్ ప్రాంగణంలో బతుకమ్మ నవరాత్రి ఉత్సవాలు మూడో రోజైన సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు తంగేడు, గునుగు, చామంతి, బంతి పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలతో సందడి చేశారు. మూడో రోజు వేడుకల్లో భాగంగా అమ్మవారికి ముద్దపప్పును నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకమ్మలను నీటి కొలనులో నిమజ్జనం చేసి, ప్రసాదాలను పంచుకుంటూ వాయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావాణి

### ఎంపీడీవో సురేందర్ కుమార్



**కాల్వ శ్రీరాంపూర్ అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** ప్రజల యొక్క సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని. సమస్యలు ఉన్న ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని. ఎంపీడీవో సురేందర్ కుమార్ సూచించారు. కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో గల. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రోజున ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు సమస్యలపై నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ డాక్టర్ రాపల్లి రాములు. వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మేదరి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**కొత్తపల్లి అక్టోబర్ 12, (ప్రజా జ్యోతి)** మేదరి మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రోజున కరీంనగర్‌లోని రేకుర్తి సంఘ భవనంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు పూలను పూజిస్తూ ప్రత్యేకంగా జరుపుకోవడం ఎంతో గొప్ప విషయమని నిర్వాహకులు పేర్కొన్నారు. మహిళల ఐక్యతకు, తెలంగాణ సంస్కృతి వైభవానికి బతుకమ్మ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో మేదరి మహిళా సంఘం నగర అధ్యక్షురాలు వాణిశ్రీ, ప్రధాన కార్యదర్శి పిట్టల స్వప్నతో పాటు లక్ష్మి భాగ్య జ్యోతి సుజాత పలువురు మహిళలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**చిగురు మామిడి/అక్టోబర్ 12/ (ప్రజా జ్యోతి) :** చిగురుమామిడి మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,జెపిఆర్ ఫౌండేషన్ చైర్మన్,ప్రముఖ సామాజిక సేవకులు ముప్పిడి జయప్రకాష్ రెడ్డి తండ్రి రిటైర్ట్ ప్రధానోపాధ్యాయుడు ఇంద్రారెడ్డి ఇటీవల మృతి చెందాగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ వారి కుమారులైన ముప్పిడి జయప్రకాష్ రెడ్డి,సత్యప్రకాష్ రెడ్డితోపాటు వారి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు.ఇంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఇంద్రారెడ్డి మృతికి గల కారణాలను,కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంద్రారెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలిపిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.గతంలో ముల్కనూర్ గ్రామాన్ని మాజీ



ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత తీసుకున్న సమయంలో,గ్రామాభివృద్ధి కోసం ఇంద్రారెడ్డి అన్ని రకాలుగా ఎంతో సహకరించారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అలాంటి ఆదర్శవంతమైన మంచి మనిషి ఈరోజు మన మధ్య లేకపోవడం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి,మెడికేర్ హాస్పిటల్ చైర్మన్ ముప్పిడి రాజశేఖర్ రెడ్డి,మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య,గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర తిరుపతి గౌడ్, మాజీ సర్పంచ్ ముప్పిడి నరసింహారెడ్డి,నాయకులు పెసరిరాజేశం,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి

**మంథని, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని మండలం సూరయ్య పల్లి రైతు వేదికలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయ రంగంపై దాని ప్రభావం, రైతులకు ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, వ్యవసాయ, సహకార శాఖ కమిషనర్లు, శాస్త్రవేత్తలు పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు చోటుచేసుకున్నందున రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరు తడి పంటల సాగుపై ప్రణాళికలు



రూపొందించుకోవాలని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తీసుకునే చర్యలకు సహకార రంగం ద్వారా తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వానకాలం పంటలను కాపాడేందుకు పలు ప్రత్యేక ముందస్తు చర్యలు చేపడుతున్నారని, అంతే గాకుండా రాబోయే డిసెంబర్ నాటికి ఎల్ నినో ప్రభావం తీవ్ర రూపం దాల్చనుందని, రబీ సీజన్ లో తక్కువ నీటి వినియోగం గల పప్పు దినుసులు, మొక్క జొన్న లాంటి పంటలు వేసుకోవాలని సూచిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సర్పంచులు లక్కాకుల సత్యనారాయణ, మేడ రాజయ్య, వ్యవసాయ అధికారి నవ్య, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ప్రత్యూష, శివ కుమార్, మురళి మధు, మధుకర్, హారిక, సౌమ్య, ఏపీఎం, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

## విగ్రహ రూపంలో అమరుడైన సాయికుమార్

## ప్రజల గుండెల్లో చెరగని ముద్ర

### కాంగ్రెస్ నేత చొప్పరి సదానందం..



**ముత్తారం, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు దివంగత డాక్టర్ బియ్యని సాయికుమార్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం ముఖ్య అతిథిగా పాల్గొని, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదంలో సాయికుమార్ అకాల మరణం చెందినా, ప్రజల మనసుల్లో ఆయన చేసిన సేవలు చెరగని ముద్ర వేశాయన్నారు. తండ్రి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేందుకు కుమార్తెలు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వారి ప్రేమాభిమానాలకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు బియ్యాని శివకుమార్, పారుపల్లి సర్పంచ్ చొప్పరి సంపత్, సర్పంచులు రాపెల్లి రాజయ్య, చిలువేరి జ్యోతి–లక్ష్మణ్, పెగడ తిరుమల–కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బకతట్ల వినీత్ కుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షులు వాజిద్ పాషా తదితర కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మి పవనసుత రైస్ మిల్లులో

## విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల తనిఖీలు



**మంథని, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** సీఎంఆర్ ధాన్యం కుంభకోణంపై విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శ్రీలక్ష్మి, పవనసుత రైస్ మిల్లులో సోమవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ బజ్జూరి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో రామేశ్వరరావు ఆర్ ఐ రాజిరెడ్డి లు మంథని పరిధిలోని పవనసుత రైస్ మిల్లులో, సూరయ్య పల్లె గ్రామంలోని శ్రీలక్ష్మి రైస్ మిల్లులో తనిఖీలు చేపట్టారు. రూ. 12 కోట్ల వరి ధాన్యం ప్రభుత్వానికి బకాయి విషయంలో ఖమ్మం పల్లి మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్ రాష్ట్ర విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ డీజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీ సమయంలో పవనసుత రైస్ మిల్ యజమాని పవన్ అందుబాటులో అక్కడ ఉన్న వారితో వివరాలు సేకరించారు. అయితే మిల్లు సామర్థ్యానికి మించి సిఎంఆర్ ధాన్యం కోసం అనుమతులు ఇచ్చినట్లు అధికారుల విచారణలో వెల్లడయింది. శ్రీలక్ష్మి రైస్ మిల్లులో తనిఖీ చేయగా యజమాని ఓల్లాల సత్యనారాయణ ను విచారించారు. శ్రీలక్ష్మి రైస్ మిల్లు తనిఖీలు చేపట్టగా రికార్డుల ప్రకారం ధాన్యం నిలువలు సక్రమంగా లేనట్టుగా అధికారుల విచారణలో వెల్లడైంది. అయితే రెండు రైస్ మిల్లుల యజమానులపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయని రూ. 12 కోట్ల మేర సీఎంఆర్ ధాన్యం ప్రభుత్వానికి బకాయి ఉన్నట్లు ఫిర్యాదు రావడంతో తనిఖీలు చేపట్టామని పూర్తి నివేదికను ఉన్నత అధికారులకు అందజేస్తామని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ రమేష్ గౌడ్ తెలిపారు.

## పేదల కు వైద్య సేవలో నిస్వార్థ సేవకుడు సాయికుమార్..

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్..



**ముత్తారం,,అక్టోబర్12 (ప్రజా జ్యోతి)**ఎలాంటి స్వార్థం లేకుండా పేద ప్రజలకు వైద్య సేవలు అందించిన బియ్యని సాయికుమార్ నిజమైన నిస్వార్థ సేవకుడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కొనియాడారు. మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్ఎంపీ వైద్యుడు దివంగత బియ్యని సాయి కుమార్ జయంతి సందర్భంగా,వారి వ్యవసాయ క్షేత్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాయికుమార్ విగ్రహాన్ని మధూకర్ ఆవిష్కరించారు. అనంతరం అక్కడ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి వృత్తిలోనూ ధనార్జనే ధ్యేయంగా మారుతుంటే,సాయికుమార్ మాత్రం పేదల ఆరోగ్యమే పరమావధిగా సేవలు అందించి అందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోతుపెద్ది కిషన్ రెడ్డి,మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు నూనె కుమార్, ఓడేడు గ్రామ సర్పంచ్ పోతిపెద్ది కవిత, పరుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఒడ్నాల రాజు, మాజీ సర్పంచ్ ఇల్లందుల అశోక్ గౌడ్, మండల ఆర్ఎంపి డాక్టర్ల సంఘం అధ్యక్షుడు సదానందం, షేర్ స్వామి, బి ర్ఎస్ నాయకులు, అయితే చంద్రశేఖర్, నీరటి రవి,ఊట్ల శ్రీను పలువురు మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు సాయికుమార్ కుటుంబ సభ్యులు బంధువులు అభిమానులు పాల్గొన్నారు..

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు..



**ముత్తారం,అక్టోబర్12 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైభవంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరిగింది.ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ అమరేందర్ రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు చాలా ఉత్సాహంగా సాగాయి.ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలోని మహిళా ఉద్యోగులు,సిబ్బంది అందరూ కలిసి ఉత్సాహంగా బతుకమ్మలను పేర్చి,సాంప్రదాయ బద్ధంగా బతుకమ్మ ఆడి పాడారు.తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆసుపత్రి ప్రాంగణంలో జరుపుకోవడం ద్వారా మహిళా ఉద్యోగులలో పండుగ వాతావరణం ఉట్టిపడింది.వైద్య అధికారి అమరేందర్ రావు మహిళా సిబ్బందికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ,ఇలాంటి వేడుకలు సిబ్బందిలో సానుకూల దృక్పథాన్ని,ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారితో పాటు ఆసుపత్రి సిబ్బంది మరియు మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రికి వినతి

**రామగిరి, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రాజాపూర్ గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీజేపీ సీనియర్ నాయకుడు మాటేటి రాజబాబు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలపై స్పందించిన కేంద్ర మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపినట్లు రాజబాబు వెల్లడించారు. ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగి, గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## కళ్యాణ్ లక్ష్మి చెక్కులు అందజేత



**కాల్వ శ్రీరాంపూర్ అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో గల. తహసిల్దార్ కార్యాలయంలో. వివిధ గ్రామాల్లో గల కళ్యాణ్ లక్ష్మి లబ్ధిదారులకు .చెక్కులను తహసిల్దార్ రాపల్లి రాముడు .మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ లతో కలిసి. సోమవారం రోజున లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా జనవేణ సదయ్య. సర్పంచులు ఆరెల్లి రమేష్. మిట్టపల్లి కొమురయ్య .కలవేన రమా రమేష్. ఉప సర్పంచ్ దర్శల రవి .తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో గంజాయి చాక్లెట్ల దందా



**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 12, (ప్రజాజ్యోతి):** కరీంనగర్ టవర్ సర్కిల్‌లోని లేబర్ అడ్డా వద్ద గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు సోమవారం అరెస్టు చేశారు.అతడి నుంచి 908 గ్రాముల బరువున్న 168 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.డివిజన్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్,జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సంతోష్ ఆదేశాల మేరకు డీటీఎఫ్ కరీంనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. దుర్గాభవాని ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు.హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన లింగంపల్లి నరేష్ ను అదుపులోకి తీసుకుని,కేసు నమోదు చేశారు.అనంతరం నిందితుడిని కరీంనగర్ అర్బన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.గంజాయిని విక్రయించినా, సరఫరా చేసినా,కలిగి ఉన్నా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు సహకరించిన వారిపైనా చర్యలు తప్పవన్నారు.గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని కోరారు.ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ పి. రవికుమార్,కానిస్టేబుళ్లు జి. రాజు,బి. రాజేందర్,జె. సతీష్,అక్షర,డ్రైవర్ ఎస్. గోపి పాల్గొన్నారు.

## ఆర్టీసీ విజయోత్సాహం.. ఆర్జీ-3లో ఏఐటీయూసీ నాయకుల ర్యాలీ



**రామగిరి, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి) :** ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ సాధించిన విజయంతో ఏఐటీయూసీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని సింగరేణి ఆర్జీ-3 ఏరియాలో కార్మిక నాయకులు ర్యాలీ నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ నెల 9న జరిగిన ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో 11 రీజియన్లలో యూనియన్ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి. రావు, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి, బ్రాంచ్ సెక్రటరీ ఎం.ఆర్.సి. రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ డి.టి. రావు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు సంస్థ మనుగడ కోసం ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం పోరాడుతోందన్నారు. ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభాపక్ష నాయకుడు కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. ఆర్టీసీ కార్మికులు ప్రదర్శించిన ఐక్యత సింగరేణిలోనూ కొనసాగాలని, హక్కుల సాధనకు కార్మికులంతా కలిసికట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్జీ-3 పరిధిలోని వివిధ గనులు, విభాగాల పిట్ సెక్రటరీలు, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు, షిఫ్ట్ సెక్రటరీలు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, కమిటీల ప్రతినిధులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ వైఫల్యాలపై
# కాంగ్రెస్ ప్రచారం



**గోదావరిఖని, అక్టోబర్ 12 ( ప్రజా జ్యోతి):** రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు అధికార పార్టీ నాయకులు,కార్యకర్తలు బి ఆర్ ఎస్ వైఫల్ వైఫల్యాలను ఎండగట్టారు. దీనిలో భాగంగా మంగళ వారం ఆర్జీవన్ జీడికె 11ఏ, ఓసీపీ-5,ఏరియా వర్క్ షాప్,సింగరేణి ఏరియా హాస్పిటల్ తో పాటు ఇతర బొగ్గు గనుల వద్ద ఎమ్మెల్యే బృందం కరపత్రాలను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కార్మికులకు జరిగిన అన్యాయం,కార్మికుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను కార్మికులకు వివరించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి సంస్థకు సంబంధించిన నిధుల వినియోగం,కార్మికుల ఆదాయపు పన్ను మినహాయింపు,సొంత ఇంటి పథకం,లాభాల వాటా చెల్లింపులు,మెడికల్ బోర్డు ద్వారా వారసత్వ ఉద్యోగాల కల్పన వంటి అంశాల్లో కార్మికులకు ఎదురైన సమస్యలను కరపత్రాల్లో ప్రస్తావించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం చేపడుతున్న చర్యలను,కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న అంశాలను వివరించారు.కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు,ఆదాయపు పన్ను మినహాయింపు,లాభాల వాటా చెల్లింపులు,వారసత్వ ఉద్యోగాల వంటి కీలక అంశాల పరిష్కారానికి కృషి చేస్తున్న విషయాలను తెలిపారు.సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, సంస్థ అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నాయకత్వంలో నిరంతరం కృషి చేస్తామని బృందం సభ్యులు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే టీం సభ్యులు జనగాం శ్రీనివాస్ గౌడ్,అరగంట కృష్ణ, భాస్కర్ కిరణ్,పాకాల సాయికుమార్, బద్రి శంకర్,ఎల్.ఆంజనేయులు, గోషికె కనకయ్య, మండల రమేష్, దార సుశీల,రవికుమార్,కుమారస్వామి సంపత్,మామిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తున్నాం

**రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి**

**గోదావరిఖని, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి) :** రామగుండం కార్పొరేషన్ లోని అన్ని డివిజన్ లలో పార్టీలకు అతీతంగా ఏక కాలంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 60వ డివిజన్ మారుతీ నగర్ వాటర్ ట్యాంక్ వద్ద సి సి రోడ్డు నిర్మాణ పనులను డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య తో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా అభివృద్ధిలో వెనుక బడి ఉన్న రామగుండంలో ఎం ఎల్ ఎ గా రాజ్ ఠాకూర్ ఎన్నికైన తరువాత ప్రజలకు సంపూర్ణ మౌలిక వసతులు కల్పించే దిశగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు . డి ఎం ఎఫ్ టి నిధులు రూ.11 కోట్ల నుంచి సుమారు రూ.50 లక్షలు వెచ్చించి మారుతి నగర్ హనుమాన్ దేవాలయం నుండి వాటర్ ట్యాంక్ వైపు వై జంక్షన్ మాదిరిగా రోడ్ నిర్మిస్తున్నామని,మన్నిక గా ఉండేలా అత్యంత నాణ్యతతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. డివిజన్ లో మిగిలిన సమస్యలకు కూడా ఒక్కటొక్కటిగా అన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి,నాయకులు మేకల అబ్బాస్,నగర పాలక సంస్థ ఎ.ఇ తేజస్విని, టి పి ఓ నవీన్ పాల్గొన్నారు. కాగా మేయర్ , డిప్యూటీ మేయర్ లు మారుతి నగర్ లో ప్రతిష్ఠించిన దుర్గా దేవి మాత మండపాన్ని సందర్శించి అమ్మ వారికి మొక్కులు సమర్పించారు.

## తనుశ్రీ డెవలపర్స్ ఆధ్వర్యంలో
## సాయి రిత్విక్ పుట్టినరోజు వేడుకలు



**తిమ్మాపూర్ అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి ):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తనుశ్రీ ఇన్ఫ్రా డెవలపర్స్ రియల్ ఎస్టేట్ హెడ్ ఆఫీస్ లో తనుశ్రీ డెవలపర్స్ సిఎండి ఎలుక సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం దూల జ్యోతి సంపత్ దంపతుల కుమారుడు దూల సాయి రిత్విక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు కూతురు శ్రీకృతి పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో నరేష్, రిపోర్టర్ శాంతి కుమార్, రఘుపతి, సంతోష్ నాయక్,శ్రీనివాస్, అంజయ్య,శాంతకుమార్ పద్మ,శామాల, హిమజ,స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో యాసంగి సాగుపై
# అప్రమత్తంగా ఉండాలి

## రైతులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ముస్తాబాద్, అక్టోబర్ 12 ( ప్రజా జ్యోతి )**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, భూగర్భ జలాలు, సాగునీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు యాసంగి పంటల సాగుపై ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మాట్లాడిన ఆయన, రాబోయే యాసంగి సాగు ప్రణాళికలు, నీటి లభ్యత, ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై అవగాహన కల్పించారు.




**నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక**

ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరం కలిగిన పంటల సాగుపై రైతులు పునరాలోచన చేయాలని సూచించారు. నీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుకు విరామం ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని తెలిపారు. ముందస్తు ప్రణాళిక లేకుండా పెట్టుబడులు పెట్టి నష్టపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, స్వల్పకాలిక పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

**స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళిక**

వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, ప్రాజెక్టులు, చెరువుల్లో నీటి నిల్వలను పరిగణనలోకి తీసుకొని పంటలను ఎంపిక చేసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా తమ ప్రాంతంలోని నీటి వనరులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, పంటల సాగుకు ముందు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**మూడు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్**

ముస్తాబాద్ మండలంలోని ముస్తాబాద్, నామాపూర్, బదనకల్ రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొని యాసంగి సాగుపై రైతులకు ముందస్తు అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయిలో నీటి లభ్యతను అంచనా వేయడం, వివిధ శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టడంపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లచ్చాలు, తహసీల్దార్ అబ్దుల్ ఫరూక్, వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటేష్, నరేష్, అఖిల, రేవతి, అనూష, ఏపీఎం, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయొద్దు..!

**కరీంనగర్ టౌన్ అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి )** ఆర్థరైటిస్ (కీళ్ల వాతం) సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రాకేష్ విలేకరుల సమావేశంలో తెలిపారు .




ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం మెడికవర్ ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కీళ్లలో వాపు, నొప్పి, బిగుతు, కదలికల్లో ఇబ్బందులు కలిగించే పరిస్థితులను ఆర్థరైటిస్ అంటారని తెలిపారు. ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ సహా పలు రకాలుగా ఇది కనిపిస్తుందన్నారు. వయసు పెరగడం, కీళ్లపై అధిక ఒత్తిడి, అధిక బరువు, గతంలో కీళ్లకు గాయాలు కావడం, రోగనిరోధక వ్యవస్థలో మార్పులు వంటి కారణాలతో ఈ సమస్య తలెత్తవచ్చన్నారు. ఆర్థరైటిస్‌తో నడవడం, మెట్లు ఎక్కడం, కూర్చుని లేవడం వంటి రోజువారీ పనులు కూడా బాధాకరంగా మారుతాయన్నారు. ఆర్థరైటిస్ తీవ్రత, కీళ్లకు జరిగిన నష్టం, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి చికిత్స నిర్ణయిస్తారని... ప్రారంభ దశలో వైద్యుల సూచనల మేరకు మందులు, ఫిజియోథెరపీ, తగిన వ్యాయామాలు, బరువు నియంత్రణతో ఉపశమనం పొందవచ్చన్నారు. వ్యాధి ముదిరి కీళ్లలో తీవ్రమైన నష్టం ఏర్పడి, మందులు, ఇతర చికిత్సలతోనూ నొప్పి తగ్గకపోతే శస్త్రచికిత్సను పరిశీలిస్తామన్నారు. అవసరమైన సందర్భాల్లో మోకీలు లేదా తుంటి కీలు మార్పిడి శస్త్రచికిత్సతో నొప్పి తగ్గి, కదలికలు మెరుగుపడే అవకాశం ఉంటుందన్నారు. నొప్పి తగ్గించే మందులను వైద్యుల సలహా లేకుండా తరచుగా వాడటం వల్ల కడుపులో అల్సర్లు, రక్తస్రావం, మూత్రపిండాలు, గుండె సంబంధిత సమస్యల ముప్పు పెరగవచ్చన్నారు. అదే సమయంలో నొప్పిని నిర్లక్ష్యం చేయడం వల్ల కదలికలు తగ్గి రోజువారీ జీవితంపై ప్రభావం పడుతుందని తెలిపారు. బరువు అదుపులో ఉంచుకోవడం, కీళ్లపై అధిక ఒత్తిడి పడకుండా చూడటం, వైద్యుల సూచనలతో వ్యాయామం చేయడం, మందులను సూచించిన విధంగానే వాడటం ద్వారా సమస్యను నియంత్రించుకోవచ్చని సూచించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో అనెస్థీషియా హెడ్ డాక్టర్ వినయ్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి

### రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి



**గోదావరిఖని, అక్టోబర్ 12 ( ప్రజా జ్యోతి ) :** గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 19న దసరా ఉత్సవాలు గతంలో కంటే మరింత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సింగరేణి,ఎన్ టి పి సి తదితర ప్రభుత్వ,ప్రభుత్వ రంగ సంస్థల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు.ఈ మేరకు డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,కార్పొరేషన్ కమిషనర్ జె.అరుణ శ్రీ తో కలిసి వివిధ ప్రభుత్వ,ప్రభుత్వ రంగ సంస్థల అధికారులతో సోమవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ సినీ ఆర్టిస్ట్,స్థానిక కళాకారుడు శివారెడ్డి నేతృత్వంలో సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు ఫైర్ షో, రామ్ లీలా తదితర కార్యక్రమాలుంటాయన్నారు. ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ తో పాటు ,జిల్లా మంత్రి శ్రీధర్ బాబుతో పాటు పలువురు మంత్రులు, శాసన మండలి,పార్లమెంట్ సభ్యులు, ఇతర ఎమ్మెల్యేలు,ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చీకటి ప్రాంతాల్లో అదనంగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు నగరమంతా దేదీప్యమానంగా కనబడేలా సిరీస్ బల్బులతో కూడళ్లను అలంకరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో కార్పొరేటర్లు గట్ల రమేష్ ,వడ్లూరి రవి ,దాసరి సాంబమూర్తి ,సాగి సంతోష్ రావు,ఎన్ పి డి సి ఎల్ ఎ ఇ జమీల్ పాషా,ఆర్ జి వన్ ఎస్ ఓ టు జి ఎం కె. చంద్ర శేఖర్,ఎస్ ఓ టు జి ఎం ఆర్ జి2 రాముడు , డి, జి ఎం సివిల్ వర ప్రసాద్, డి జి ఎం . రామ్ రెడ్డి , సింగరేణి అధికారి జితేంద్ర ,ఎస్ .ఇ బాల రాజు , ఫైర్ ఆఫీసర్ రాజేశం, నగర పాలక సంస్థ ఇ ఇ శాంతి స్వరూప్ , ఎ ఇ మీర్ , నాయకులు ధీటి బాలరాజు , తిప్పారపు శ్రీనివాస్ పాల్గొన్నారు

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత




**చొప్పదండి అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** చొప్పదండి మండలానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టి ఎస్ 02 యు సి 5262 నెంబర్ గల ట్రాక్టర్‌ను ఎస్సై ఎన్.రాజ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పట్టుకున్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అందజేశారు.

## సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని

# సమష్టిగా ఎదుర్కోవాలి






- తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత..
- నీటి లభ్యతను బట్టే యాసంగి సాగురైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**జగిత్యాల, అక్టోబర్ 12, ప్రజాజ్యోతి**

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో యాసంగి 2026–27 సీజన్‌లో నీటి లభ్యతను బట్టి మాత్రమే పంటలు సాగు చేయాలని, నీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో సాగుకు దూరంగా ఉండాలని రైతులకు సూచించారు.సోమవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పాల్గొనగా, జిల్లాలోని వివిధ రైతు వేదికల నుంచి రైతులు హాజరయ్యారు.తాగునీటికి అత్యంత ప్రాధాన్యతప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. రానున్న 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలు తీర్చేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, తాగునీటి పథకాల్లో సమస్యలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేసి కరువు పరిస్థితులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యతవ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుపై రైతులు ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తరించాలని, రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి లభ్యత, విద్యుత్ సరఫరాపై రైతులకు వాస్తవ పరిస్థితులను స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు.పశుసంపద రక్షణకు చర్యలుకరువు పరిస్థితుల్లో మనుషులతో పాటు పశుసంపదను కాపాడుకోవడం కూడా ముఖ్యమని డిప్యూటీ సీఎం తెలిపారు. పశువులకు తాగునీరు, మేత కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేయడంతో పాటు నీటి సంరక్షణ పనులను విస్తృతం చేయాలని చెప్పారు.ఉపాధి హామీ పనులు విస్తృతం చేయాలిగ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సమస్యలు తలెత్తకుండా ఉపాధి హామీ పథకం కింద పనులను పెంచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. చెరువులు, కుంటల్లో పూడికతీత, నీటి నిల్వ నిర్మాణాలు, ఫామ్ పాండ్స్, సోక్ పిట్ల నిర్మాణం వంటి పనులు చేపట్టాలని తెలిపారు. మార్చి 2027 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా అదనంగా రూ.6,500 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు.జిల్లాలో రైతులకు కలెక్టర్ సూచనలుజిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ యాసంగిలో రైతులు నష్టపోకుండా పంటల ఎంపికపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఎస్ఆర్ఎస్పీ నుంచి సాగునీరు అందే అవకాశం లేదని, భూగర్భ జలాలు మరింత తగ్గే ప్రమాదం ఉన్నందున నీటి లభ్యతను అంచనా వేసుకున్న తర్వాతే సాగు చేపట్టాలని తెలిపారు. తక్కువ నీటితో పండే పంటలు, కందులు, పెసలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, నీటి లభ్యత, పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులపై బలవంతపు నిర్ణయాలు తీసుకోకుండా వాస్తవ పరిస్థితులను వివరించి, వారు నష్టపోకుండా సరైన పంటలను ఎంచుకునేలా సహకరించాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల సీఐగా కొమ్ము తిరుపతి



**కోరుట్ల, అక్టోబర్ 12 ప్రజాజ్యోతి:** కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ గా కొమ్ము తిరుపతి బదిలీ అయ్యారు. మల్టీ జోన్ –1 పరిధిలో ఇన్స్పెక్టర్ల బదిలీల్లో భాగంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ సీపీటీసీలో పనిచేస్తున్న కొమ్ము తిరుపతిని కోరుట్ల సర్కిల్ కు బదిలీ చేశారు. గతంలో కోరుట్లలో పనిచేసిన లక్ష్మీనారాయణను మల్టీ జోన్ కార్యాలయానికి బదిలీ చేసిన నేపథ్యంలో ఈ నియామకం జరిగింది.

## పండుగ సందర్భంగా వృద్ధ మహిళలకు చీరల పంపిణీ

- కీర్తిశేషుల జ్ఞాపకార్థం అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌లో సేవా కార్యక్రమం



**ముస్తాబాద్, అక్టోబర్ 12 ( ప్రజా జ్యోతి )** కీర్తిశేషులు మద్దివేని కిషన్, కీర్తిశేషులు తుపాకుల బాలయ్య జ్ఞాపకార్థంగా పండుగ సందర్భంగా మద్దివేని స్వరూప ఆధ్వర్యంలోని గూడెం అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌లోని వృద్ధ మహిళలకు సోమవారం రోజున చీరలను పంపిణీ చేశారు. పండుగ వేళ వృద్ధ మహిళలకు చీరలను అందజేయడం ద్వారా కీర్తిశేషుల జ్ఞాపకాలను స్మరించుకుంటూ సేవాభావాన్ని చాటుకున్నారు. వృద్ధ మహిళల పట్ల ప్రేమ, ఆప్యాయతను చూపుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం అభినందనీయం. ఈ సందర్భంగా అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ, వృద్ధ మహిళలకు పండుగ కానుకగా చీరలను అందజేసిన దాతలకు ఫౌండేషన్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని, సేవా స్ఫూర్తిని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు.